ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

నల్లగొండ జిల్లా క్షేత్రాలు : ప్రత్యేకతలు – పరిశీలన

డా. నారగోని సైదులు

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక,విశ్వవిద్యాలయం, మహబూబ్ నగర్.

మెయిల్: saidulu645@gmail.com

Article Received: 08/09/2026

Article Accepted: 27/10/2026

Published Online: 29/10/2026

DOI:10.53414/Sahithyatharangini.2026.3.4.60

వ్యాస సంగ్రహం:

"క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత

క్షేత్రక్షేత్రజ్ఞయోఃజ్ఞానం యత్తద్ జ్ఞాన మతం మమ" (భగవద్గీత, 13వ అధ్యాయం. 3వ శ్లోకం)

పూర్వ కాలం మొదలుకొని ఆధునిక కాలం వరకు భారతదేశంలో ఆయా ప్రాంతాల్లో వెలసిన క్షేత్రాల్లో అతి పురాతన క్షేత్రం, గొప్ప ధర్మక్షేత్రం 'కురుక్షేత్రం'. కురుక్షేత్రం పంజాబ్ రాష్ట్రంలోని అంబాలా పట్టణానికి దక్షిణ భాగాన, ఢిల్లీ పట్టణానికి ఉత్తర భాగాన ఉంది. పూర్వం కురుక్షేత్ర స్థలంలో బ్రహ్మదేవుడు, అగ్నిదేవుడు, ఇంద్రుడు మొదలైన ఎందరో మహానుభావులు తపస్సులు చేసి, ఎన్నో ధర్మకార్యాలు చేశారు. అంతేకాదు కురుక్షేత్ర స్థలంలో తపస్సు చేసినవారు మృతి చెందిన తరువాత ఉత్తమ లోకాలకు చేరుతారు అని కురుభూపాలునికి ఇంద్రుడు వరమిచ్చాడట. ఇంతటి పవిత్రత కలిగిన కురుక్షేత్ర స్థలంలో పాండవులకు, కౌరవులకు 18 రోజుల పాటు భీకరమైన యుద్ధం జరిగింది. యుద్ధ క్షేత్రంలో శ్రీకృష్ణ భగవానుడు అర్జునికి జ్ఞానోపదేశం చేస్తూ- "క్షేత్రాలన్నింటిలోనూ ఉన్న క్షేత్రజ్ఞుణ్ణి నేనే అని తెలుసుకో. క్షేత్రానికీ క్షేత్రజ్ఞుణ్ణికీ సంబంధించిన జ్ఞానమే సరైన జ్ఞానమని తెలుసుకో" అంటూ క్షేత్రం యొక్క విశిష్టతను తెలియజేశాడు. కనుక భగవంతుడికి ఆవాసయోగ్యమైన ఈ జగత్తంతా క్షేత్రమే!. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న క్షేత్రాలు తెలంగాణ రాష్ట్రమంతటా ఉన్నాయి. అందులో భాగంగా నల్లగొండ జిల్లాలో కొన్ని ప్రసిద్ధమైన క్షేత్రాలు ఉన్నాయి. ఆ ప్రముఖ

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

క్షేత్రాలు, వాటి ప్రత్యేకతలను పరిశోధనాత్మకంగా పరిచయం చేసి, వాటి విశిష్టతలను పరిశోధన పూర్వకంగా విశ్లేషించటం ఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

కీలక పదాలు: తెలంగాణ క్షేత్రాలు, నల్లగొండ జిల్లా క్షేత్రాలు, భగవద్గీత, చెరువుగట్టు రామలింగేశ్వర స్వామి క్షేత్రం, వాడపల్లి అగస్త్యేశ్వర స్వామి క్షేత్రం.

1. ఉపోద్ఘాతం:

తెలుగు సాహిత్య చరిత్రలో స్థల పురాణాలు లేదా క్షేత్ర మహాత్మ్యాలకు ఒక విశిష్టమైన స్థానం ఉంది. తెలుగులో శ్రీనాథుడు రాసిన కాశీఖండంతో క్షేత్ర మహాత్మ్యం ప్రారంభమైంది. ఆ తరువాత భీమేశ్వర పురాణం (శ్రీనాథుడు), శ్రీరంగ మహాత్మ్యం (విజయరంగ చొక్కనాథుడు), ధేనుమహాత్మ్యం (విజయ కామకవి), హాలాస్య మహాత్మ్యం (కళువె నంజ రాజు) వంటివి రాయబడ్డాయి. సాధారణంగా ఆయా ప్రాంతాల్లో నెలవైన పుణ్య స్థలాలను, దేవాలయాలను క్షేత్రాలుగా వ్యవహరిస్తుంటారు. మనిషి శరీరంలో ఆత్మ ఉన్నట్లే, ప్రతి దేవాలయంలో దేవుడు ఉంటాడని ప్రజల విశ్వాసం. ఆనాటి కాలం నుంచి దేవుళ్లు/దేవతలకు పూజలు చేయడం, ఆలయాలు నిర్మించటం సంప్రదాయంగా వస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో రెండు రకాల క్షేత్రాలు దర్శనమిస్తుంటాయి. ఒకటి- గ్రామ దేవతల క్షేత్రాలు, రెండు- విష్ణువు, శివుడు, గణపతి, కనకదుర్గ క్షేత్రాలు. అయితే శ్రీశైల శిఖరాన్ని దర్శిస్తే, వారణాసిలో మరణిస్తే, అరుణాచలాన్ని స్మరిస్తే ముక్తి కలుగుతుందని భక్తులు విశ్వసిస్తుంటారు. అరుణాచల క్షేత్రంలో, సింహాచల క్షేత్రంలో గిరి ప్రదక్షిణలు చేస్తే అనుకున్నవి జరుగుతాయని, ఆయా క్షేత్రాల్లో నెలకొన్న తీర్థాల్లో స్నానం చేస్తే పాపాలు పోతాయని పురాతన కాలం నుంచి బలంగా నమ్ముతారు. తెలంగాణ రాష్ట్రంలో వెలసిన ప్రతి క్షేత్రానికి కొన్ని ప్రత్యేకమైన మహిమలు ఉంటాయని ప్రజలు గాఢంగా విశ్వసిస్తారు.

తెలంగాణ రాష్ట్రంలో ప్రతి చెట్టుకి, పుట్టకి, గుడికి, బడికి, ప్రాంతానికి అనంతమైన చరిత్ర ఉంది. శాతవాహనుల కాలం నుంచి ఈనాటి కాలం వరకు చరిత్రకు కానవచ్చిన, కానరాని ప్రాంతాలు, దేవాలయాలు, కోటలు, శాసనాలు, శిల్పాలు, వీరుల గాథలు ఎన్నో ఉన్నాయి. అటువంటి వాటిల్లో నల్లగొండ జిల్లాలో నెలకొన్న క్షేత్రాలు/దేవాలయాలకు కొన్ని వందల వేల సంవత్సరాల చరిత్ర ఉంది. ఆ చరిత్రను తెలుసుకునేముందు నల్లగొండ జిల్లా సంక్షిప్త చరిత్రను తెలుసుకోవటం ఆవశ్యకం.

2. నల్లగొండ జిల్లా సంక్షిప్త చరిత్ర:

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 33 జిల్లాల్లో నల్లగొండ జిల్లా ఒకటి. 'నల్లగొండ జిల్లా – పోరాటాల ఖిల్లా'గా ప్రసిద్ధి చెందింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 'నల్లగొండ', 'యాదాద్రి', 'సూర్యాపేట' జిల్లాలుగా విభజింపబడింది. నల్లగొండ జిల్లాకు ఉత్తరాన యాదాద్రి, ఈశాన్యాన సూర్యాపేట, దక్షిణాన గుంటూరు, తూర్పున కృష్ణా, పశ్చిమాన శంషాబాద్, నైఋతిన నాగర్ కర్నూలు జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి. ఉద్యమాల పురిటిగడ్డగా పేరొందిన నల్లగొండ జిల్లాల్లో ఎందరో కమ్యూనిస్టులు, దేశభక్తులు, సాహితీవేత్తలు, స్వాతంత్ర్య సమరయోధులు ఉద్యమాల పరంగా, సాహిత్యం పరంగా చరిత్రకెక్కారు.

ప్రతి ఊరికి, వ్యక్తికి, స్థలానికి చరిత్ర కథనాంశాలు ఉన్నట్టే నల్లగొండ జిల్లాకు కూడా గొప్ప చరిత్ర ఉంది. నల్లగొండ జిల్లా చరిత్రను ఒకసారి పరిశీలిస్తే- మొదటగా శాతవాహనులు, కదంభవంశ రాజులు, చాళుక్యులు, కాకతీయులు, బహమనీ రాజులు, కుతుబ్‌షాహీలు, మొగలులు, ఆసఫ్‌జహీయులు, నిజాం రాజులు ఈ జిల్లాను పరిపాలించారు. నల్లగొండ జిల్లాను పూర్వం 'నీలగిరి' అని పిలిచేవారు. ఎందుకంటే- నల్లగొండలో రెండు ప్రధాన గుట్టలు ఉన్నాయి. ఒకటి లతీఫ్‌సాఫ్ గుట్ట, మరొకటి కాపురాల గుట్ట. ఈ రెండు గుట్టలు నల్లగా ఉంటాయి. ఈ నల్లటి గుట్టలు లేదా నల్లరాతి గిరుల మధ్య ఉన్న ప్రాంతాన్ని 'నల్లకొండ'గా, 'నీలగిరి'గా పిలిచేవారట. కాలక్రమంలో నల్లకొండ 'నల్లగొండ'గా ప్రసిద్ధి చెందింది అని ఒక ఐతిహ్యం ఉంది.

2011 జానాభా లెక్కల ప్రకారం- నల్లగొండ జిల్లాలో 34,83,648 లక్షల జనాభా ఉంటే, అందులో పురుషులు 17,58,061 మంది, స్త్రీలు 17,25,587 మంది ఉన్నారు. అక్షరాస్యత పరంగా పురుషులు 70.19శాతం, స్త్రీలు 45.07శాతంగా ఉన్నారు. 2016 ప్రకారం ఈ జిల్లాలో 31 మండలాలు, 844 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొలనుపాక, నాగార్జున సాగర్, పోచంపల్లి, పిల్లలమర్రి, చెర్వుగట్టు, పానగల్లు వంటి ప్రాంతాలు పర్యాటక ప్రదేశాలుగా తూలతూగుతున్నాయి. నల్లగొండ జిల్లా మీదుగా కృష్ణా నది, మూసీ నది, హాలియా, కనగల్, చిన్నపలైర్, డిండి వంటి నదులు ప్రవహిస్తున్నాయి. పోచంపల్లి, నాగార్జునసాగర్, కొలనుపాక జైన మందిరం, పానగల్లు మందిరం, దేవరకొండ కోట, సంస్థాన్ నారాయణపురం కోటలు పర్యాటక ప్రదేశాలుగా ప్రసిద్ధిగాంచాయి.

3. నల్లగొండ జిల్లా క్షేత్రాలు – ప్రత్యేకతలు:

"దేవుని యందు భక్తి కలిగి ఉండుట

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

మనస్సు చేసిన పుణ్యము
దేవుని నామము పలుకుట
నోరు చేసిన పుణ్యము
దేవుని పూజించుట
చేతులు చేసిన పుణ్యము
దేవాలయమునకు పోవుట
కాళ్ళు చేసిన పుణ్యము
దేవుని చూడటం
కన్నులు చేసిన పుణ్యము
దేవుని కథలు వినుట
చెవులు చేసిన పుణ్యము
దేవునికి నమస్కరించటం
శిరస్సు చేసిన పుణ్యము" (పెద్ద బాలశిక్ష, ప్రథమ భాగము, పుట. 85) అంటూ దేవుని విషయంలో, దేవాలయాల విషయంలో పూర్వం నుంచి ఒక సంప్రదాయంగా వస్తుంది. మానవులు పాటించవలసిన ధర్మాలు, చేయవలసిన పనులు, దర్శించవలసిన క్షేత్రాల గురించి స్కంద పురాణంలో 81,000 శ్లోకాలలో చెప్పబడింది. ఇంతటి విశిష్టత కలిగిన క్షేత్రాలు నల్లగొండ జిల్లాల్లో చాలా ఉన్నాయి. అందులో 'చెరువుగట్టు రామలింగేశ్వర స్వామి ఆలయం', 'వాడపల్లి అగస్త్యేశ్వర స్వామి ఆలయం', 'లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం', 'నల్లగొండ సీతారామచంద్ర స్వామి ఆలయం', 'పానుగల్లు సోమేశ్వరాలయం', 'పేరూరు స్వయాంభూలింగేశ్వర ఆలయం', 'నాగులపాటి అన్నారం' వంటి ఆలయాలు అతి పెద్ద ఆలయాలుగా, ఎంతో చరిత్ర కలిగిన క్షేత్రాలుగా ప్రసిద్ధిగాంచాయి. మచ్చుకు మూడు క్షేత్రాల చరిత్ర, వాటి ప్రత్యేకతలను తెలియజేస్తాను.

3.1. చెరువుగట్టు రామలింగేశ్వర స్వామి క్షేత్రం:

"సంప్రదాయ మొక జీవనది వంటిది. మానవునిలో వికాసమున్నన్నినాళ్ళు అది సజీవముగా ఉండును. క్రొత్త క్రొత్త మార్పులతో వసంత ద్రుమము వలె చిగురించుచుండును. మతంలో, సంస్కృతిలో, సాహిత్యంలో మానవుల నిత్యనైమిత్తిక క్రియాకలాపములలో

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

సంప్రదాయములపైనే ప్రయోగము లవశ్యము జరుగుచుండును." (ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు. పుట.1) అని జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా. సినారె గారు పేర్కొన్నారు. సినారె పేర్కొన ఈ మాటలు కేవలం మతం-సంస్కృతి-సాహిత్యాలకే కాదు ఆయా ప్రాంతాల్లో పుణ్య క్షేత్రాలకు కూడా వర్తిస్తాయి. ఎందుకంటే- భారతదేశంలో సింధు నాగరికత నుంచి దేవుళ్లను పూజించటం, ఆలయాలను నిర్మించటం సంప్రదాయంగా వస్తుంది. అలా వందల సంవత్సరాలుగా ప్రజల చేత ఆరాధింపబడుతూ, ప్రతి అమావాస్య రోజున భక్తులతో కిటకిటలాడే అతి పురాతన క్షేత్రాల్లో 'చెరువుగట్టు రామలింగేశ్వర స్వామి' ఆలయం ఒకటి. ఈ క్షేత్రాన్ని 'శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయం'గా పిలుస్తారు. నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలో ఈ క్షేత్రం ఉంది. ఇక్కడ ప్రధాన దైవంగా శివుడు ప్రజలచేత కొన్ని వందల సంవత్సరాల నుంచి పూజలు అందుకుంటున్నాడు.

'పూర్వం పరశురాముడు క్షత్రియ వధానంతరం తాను చేసిన పాప పరిహారార్థం నిమిత్తం దేశం నలుమూలలా మొత్తం 108 శివ లింగాలను ప్రతిష్టించాడట. ఒక్కొక్క లింగం వద్ద కొన్ని వందల సంవత్సరాలపాటు తపస్సు చేశాడట. తపస్సు ద్వారా పొందిన తపోఫలాన్ని 108 క్షేత్రాలకు ధారపోసి, మానవ కళ్యాణానికి పాటుబడ్డాడట. అలా పరశురాముడు ప్రతిష్టించిన శివ లింగాలలో చిట్టచివరిదైన 108వ శివ లింగమే చెర్వుగట్టు క్షేత్రంలో వెలసిన జడల రామలింగేశ్వర స్వామిదనీ పురాణ కథనం'. చెరువుగట్టు ప్రాంతంలో ఆనాడు పరశురాముడు శివుని వేడుకుంటూ ఎంతకాలం తపస్సు చేసినా కూడా భగవంతుడు ప్రత్యక్షం కాలేదట. కోపంతో ఊగిపోయిన పరశురాముడు అతని వద్దనున్న గండ్ర గొడ్డలితో శివలింగం ఊర్ధ్వభాగంపై ఒక దెబ్బ వేశాడట. అంతే వెంటనే శివుడు ప్రత్యక్షమై- 'ఇంతకాలం తపస్సు చేసిన ఈ ప్రాంతం ప్రముఖ శైవక్షేత్రంగా వెలుగొందుతుంది. కలియుగాంతం వరకు నేనిక్కడే ఉండి, భక్తులకు కావలసిన దీవెలను అనుగ్రహిస్తాను.' అని చెప్పి శివుడు అదృశ్యమయ్యాడట. ఆ తరువాత పరశురాముడు అక్కడే లింగాకృతిని పొంది, శివసాయుజ్యాన్ని పొందాడట. కాలక్రమంలో12వ శతాబ్దానికి చెందిన కాకతీయ గణపతిదేవ చక్రవర్తి చెరువుగట్టులో ప్రతిష్టించబడిన జడల రామలింగేశ్వర స్వామి వారికి గుహాలయాన్ని నిర్మించడంతో అప్పటి నుంచి తొలి ఏకాదశినాడు, కార్తీక సోమవారాల్లో, పౌర్ణమి, అమావాస్య, మహాశివరాత్రి

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

పర్వదినాలలో వైభవంగా ఉత్సవాలు జరుపుతున్నారట. అంతేకాదు ప్రతియేటా పెద్ద ఎత్తున స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను కూడా జరుపుతున్నామని చెర్వుగట్టు ప్రజలు చెబుతుంటారు.

చెరువుగట్టు రామలింగేశ్వర స్వామి క్షేత్రం యొక్క ప్రత్యేకత ఏమిటంటే- 'మూడుగుండ్లు'. కొండపైన శివలింగం ఉంటుంది. ఆ లింగాన్ని దర్శించడానికి మూడు గుండ్ల మధ్య ఒక చిన్న మార్గం ఉంటుంది. దాన్నే మూడుగుండ్లు అని వ్యవహరిస్తారు. అయితే, భక్తి భావం గల భక్తులు ఎంత లావు ఉన్న స్వామివారిని కీర్తిస్తూ సునాయసంగా మూడుగుండ్ల మధ్య నుంచి వెళ్లి, కొండపై ఉన్న లింగాన్ని దర్శించుకుంటారు. భక్తి భావన లేకుండా పాపాలు చేసినవారు గుండ్ల మధ్యలో చిక్కుకొని బాధపడుతుంటారు. మూడుగుండ్ల మధ్య నుంచి వెళ్లనివారు, తెలిసీ తెలియక చేసిన తప్పులను ఒప్పుకొని 'శివ, శివ' అంటూ మరోసారి ప్రయత్నిస్తుంటారు. ఎవరైతే ఆ మూడుగుండ్ల మధ్య నుంచి లింగాన్ని దర్శించుకుంటారో, వారు కోరుకున్న కోరికలను భగవంతుడు తీరుస్తాడని భక్తులు నమ్ముతుంటారు.

3.2. వాడపల్లి అగస్త్యేశ్వర స్వామి క్షేత్రం:

సంస్కృత భాషలో 'శివ' అంటే 'శుభం, సౌమ్యం' అనే అర్థాలు ఉన్నాయి. త్రిమూర్తులుగా పేరుగాంచిన బ్రహ్మ (సృష్టికర్త), విష్ణువు (సృష్టి పాలకుడు), మహేశ్వరుల (సృష్టి లయకారకుడు)లో చివరివాడైన లయకారుడు- హిందువులు పూజించే దేవుళ్లలో ప్రథముడు. ఆయనే శివుడు. ఈయన పశుపతిగా, లింగం రూపంలో సింధూ నాగరికత కాలం నుంచి ఈనాటి దాకా భక్తులచే పూజలందుకుంటున్న భగవంతుడు. భారతదేశంలో శివుడు లేని ఇల్లు - శివాలయం లేని ఊరు ఉండదంటే అతిశయోక్తి కాదు. వేదాల ప్రకారం- శివుడ్ని రుద్రునిగా, శైవంలో పరమాత్మగా, ఆది దేవునిగా పేర్కొన్నారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన శివక్షేత్రాల్లో నల్లగొండ జిల్లా దామెరచర్ల మండలం వాడపల్లి గ్రామంలో ఉన్న వాడపల్లి అగస్త్యేశ్వర స్వామి క్షేత్రం ఒకటి. ఈ ఆలయానికి 6వేల సంవత్సరాలపైగా చరిత్ర ఉంది. కృష్ణా నది, ముచికుందా నదుల సంగమ ప్రదేశం వద్ద ఉన్న అతి పురాతన శైవక్షేత్రంగా వాడపల్లి అగస్త్యేశ్వర స్వామి ఆలయం చరిత్రకెక్కింది.

'పూర్వం అగస్త్య మహాముని దేశ సంచారం చేస్తూ కృష్ణా, ముచికందా సంగమ ప్రదేశానికి వచ్చాడట. దక్షిణాపథంలో శివకేశవులను ప్రతిష్టించాలనే తలంపుతో ఒక కావడిలో విగ్రహాలను ఉంచి స్థలాన్వేషణకై వెతుకులాట ప్రారంభించాడట. చివరగా వాడపల్లికి చేరుకున్న సమయంలో తన

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

చేతిలో ఉన్న కావడిని ఒక గొల్లపిల్లవాడికి ఇచ్చి, నదీ తీరానికి వెళ్లాడట. అగస్త్యుడు నది నుంచి తిరిగొచ్చేసరికి ఆ పిల్లాడు కావడిని కిందికి దించి అక్కడి నుంచి వెళ్లిపోయాడట. అగస్త్యుడు కిందికి దించిన కావడిని ఎత్తబోతే ఎంతకూ లేవకపోవడంతో ఆశ్చర్యానికి గురయ్యాడట. అంతలోనే ఆ విగ్రహాలను ఆ స్థలంలోనే ప్రతిష్టించమని ఆకాశం నుంచి పిలుపు వచ్చిందట. ఆ పిలుపుతో వాడపల్లిని గొప్ప దివ్యస్థలంగా గుర్తించిన అగస్త్యుడు శివలింగాన్ని ప్రతిష్టించి, పూజలు చేయటం ప్రారంభించాడట'. ఈ క్షేత్రంలో అగస్త్యేశ్వర స్వామి, లక్ష్మీ నరసింహ స్వామి, మీనాక్షీదేవి ఆలయాలు కూడా ప్రసిద్ధిగాంచాయి. వాడపల్లి గ్రామం కృష్ణా, ముచికుందా నదుల సంగమ స్థానం కావడంతో మరింత పవిత్రతను సంతరించుకోవడంతో తరతరాలుగా తీర్థయాత్ర స్థలంగా వాడపల్లి వాసికెక్కింది.

వాడపల్లిలో నెలవైన అగస్త్యేశ్వరాలయం ప్రత్యేకత ఏమిటంటే- ఆలయంలో శివుడి పానుపట్టం చాలా ఎత్తుగా ఉంటుంది. పానుపట్టం మీద లింగం ఇంకో రెండు అడుగుల ఎత్తులో ఉంటుంది. లింగంపైన వెండి కళ్ళు, వెండి నాగుపాము పడగ అలంకరణగా ఉంటుంది. అయితే, ఆ లింగం మీద ఒక చిన్న గుంట ఉంది. ఆ గుంటలో చలి కాలం, ఎండ కాలం, వర్షకాలం అనే తేడా లేకుండా ఎల్లప్పుడూ నీరు ఊరుతూనే ఉంటుంది. అంతేకాదు శివలింగం తలభాగంలో ఊరుతున్న నీటిని ఎన్నిసార్లు తోడినా నీరు వస్తూనే ఉంటుంది. ఆ నీరు ఎలా వస్తుందో, ఎక్కడి నుంచి వస్తుందో, ఎంత లోతులో ఉన్నదో క్షేత్రం నిర్మించిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎవరికీ తెలియదు. ప్రతి సంవత్సరం మహాశివరాత్రి రోజున పెద్దఎత్తున జాతర జరుగుతుంది. జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు. శివరాత్రి రోజున వేలాది మంది భక్తులు అగస్త్యేశ్వరాలయానికి విచ్చేసి, పవిత్ర స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుంటారు.

3.3. ఛాయా సోమేశ్వరాలయం:

నల్లగొండ జిల్లాలో నిర్మించబడిన ప్రతి పుణ్య క్షేత్రానికి ప్రత్యేకమైన చరిత్ర ఉంది. రాజుల కాలంలో కట్టబడిన శైవక్షేత్రాల చరిత్ర, వాటి గొప్పదనాన్ని తెలుసుకోవాలంటే- ఆ ఆలయాలను నిర్మించే క్రమంలో ఉపయోగించిన రాళ్లు, వాస్తు, శిల్పాలు, గోపురాలు, కోటలను చూస్తే వాటి వెనక ఉన్న కష్టం, ప్రణాళిక అర్థమవుతుంది. ఇందుకు ఉదాహరణగా- కాకతీయ కుమార రుద్రదేవ కాలంలో సామంతుడైన మల్లికార్జున నాయకులు రాజుకు పుణ్యంగా దానమిచ్చిన 'ఛాయా

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

సోమేశ్వరాలయ' నిర్మాణం, గర్భగుడులు, గద, శంఖు చక్రాలతో చెక్కిన గోడలు, దేవనాగరి లిపిలో ఉన్న శాసనాల్ని చెప్పవచ్చు.

నల్లగొండ జిల్లా పానగల్లులో వెలసిన చారిత్రక శైవక్షేత్రం 'ఛాయా సోమేశ్వరాలయం'. క్రీ.శ. 11 -12 శతాబ్దాల మధ్య కుందూరు చోళ రాజులు తెల్లని రాయితో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయం చుట్టు గర్భగుడులు ఉండడంతో దీన్ని 'త్రికూటాలయం'గా పిలుస్తారు. గర్భాలయంలో నడుములోతు నీటిలో ఒక శివలింగం ఉంటుంది. అందులోని నీరు ప్రవహిస్తున్నట్లు అనిపిస్తుంది. కాని ఆ నీరు ఎక్కడికి ప్రవహిస్తుంది?, ఎలా ప్రవహిస్తుందన్న విషయం ఇప్పటికి అర్థం కాదు. గర్భగుడిలో నీటిలో మునిగిన శివలింగంపై రాత్రి, పగలు అనే తేడా లేకుండా అన్ని కాలాల్లో, అన్ని సమయాల్లో స్తంభాకారంలో ఒక ఛాయ కనిపిస్తుంది. ఆ ఛాయ సూర్యుడు ఉదయించినది మొదలుకొని అస్తమించేవరకు ఏమాత్రం కదలకుండా కనిపిస్తుంటుంది. ఆ స్తంభం నీడ ఎక్కడి నుంచి పడుతుంది?, ఎలా పడుతుంది? అనే అంశాలు ఇప్పటికీ మిస్టరీగానే మిగిలిపోయాయి. అయితే, సూర్యుని భార్య ఛాయాదేవి నీడ శివునిపై పడుతున్నందున ఈ ఆలయానికి 'ఛాయా సోమేశ్వరాలయం'గా పేరొచ్చిందని చరిత్రకారులు పేర్కొన్నారు. ఈ క్షేత్రం ఆవరణలో తూర్పున సూర్య దేవాలయం, పడమర దిక్కున శివాలయం, ఉత్తరాన విష్ణు ఆలయం ఉంటాయి. మహాశివరాత్రి రోజున భక్తులు వేలాది సంఖ్యలో విచ్చేసి, స్వామివారిని దర్శనం చేసుకుంటారు.

ముగింపు:

నల్లగొండ జిల్లాలో పురాతన కాలం నుంచి వందేళ్ల చరిత్ర కలిగిన శైవక్షేత్రాలు చాలానే ఉన్నాయి. సంప్రదాయాలను బట్టి, సిద్ధాంతాలను బట్టి ఆయా దేవాలయాలు/క్షేత్రాలకు సంబంధించిన చరిత్రలు, ఐతిహ్యాలు, కథలు, శాసనాలు, నమ్మకాలు, ఆరాధన పద్ధతులు ఎన్నో ఉన్నాయి. వాటన్నింటిపై లోతైన పరిశోధన చేసి, వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత పరిశోధకులు, కవులు, రచయితలు, ఆచార్యులపై ఉంది. కాలం మారుతున్నకొద్దీ, టెక్నాలజీ పెరిగిపోతున్నకొద్దీ భక్తులు పవిత్రమైన దేవాలయాలను/క్షేత్రాలను దర్శించటం లేదు. దీని వల్ల వందల వేల సంవత్సరాల చరిత్ర కలిగిన పుణ్య క్షేత్రాల ప్రత్యేకతలు మరుగునపడిపోతున్నాయి. ప్రభుత్వాలు పట్టించుకోక దేవాలయాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి నిలిపి, పుణ్య క్షేత్రాలకు మరమ్మతులు చేయించి, మరుగునపడిపోతున్న

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

ఆలయాల చరిత్రలను పుస్తకాల్లో లిఖించవలసిన అవసరం ఎంతైనా ఉంది. పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయాల స్థాయిల్లో సదస్సులు నిర్వహించి దేవాలయాలపై, వాటి వెనక దాగివున్న చరిత్రలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. అసైన్‌మెంట్ల రూపంలో ఆయా ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన దేవాలయాల చరిత్రలపై క్షేత్ర పరిశోధనలు చేయించి, వాటి మహిమలను ప్రపంచానికి తెలియజేయవలసిన ఆవశ్యకత అందరిపై ఉందనేది అక్షరాల సత్యం.

ఉపయుక్త గ్రంథసూచి:

నాగయ్య, జి. 1986. తెలుగు సాహిత్య సమీక్ష, మొదటి సంపుటం. నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి.

శాస్త్రి, ద్వా. నా. 2014. తెలుగు సాహిత్య చరిత్ర. ప్రగతి పబ్లిషర్స్, హైదరాబాద్.

సైదులు, నారగోని. 2025. ముకుంద రామారావు సాహిత్యం – ఒక పరిశీలన, రేణుశ్రీ ప్రచురణలు, హైదరాబాద్.

శివారెడ్డి, ఎల్లూరి. 2024. నల్లగొండ జిల్లా సమగ్ర స్వరూపం. తెలంగాణ సారస్వత పరిషత్తు, హైదరాబాద్.

కమాలాకర శర్మ, సాగి. 2014. కదంబం తెలుగు సాహిత్య ప్రక్రియలు – రూపాలు. మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాస పత్రిక, హైదరాబాద్.